RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 285 గురువారం 3 సెప్టెంబర్ 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥1/-

### తెలంగాణకు భారీ వర్ష సూచన.. రానున్న 3 రోజులు వానలు..

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం చల్లబడి, పలు ప్రాంతాల్లో చినుకులు ప్రారంభమయ్యాయి. రుతుపవనాలు తీవ్రరూపం దాల్చడంతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని హెచ్చరించారు.

### గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్.:మంత్రి పొన్నం

తెలంగాణలో త్వరలో ప్రారంభం కానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ పరిసర జిల్లాల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు కీలక నిర్ణయాలు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ప్రకటించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల కోసం
# జనం పరేషాన్




- రేషన్ దుకాణాల నంబర్లతో కార్డులు జారీ
-ఎవరు.. ఎక్కడ ఇస్తారో తెలియని పరిస్థితి
- అస్తవ్యస్తంగా పంపిణీ

కరీంనగర్:సెప్టెంబర్ 2:(ఇందూర్‌నేత్రం విలేకరి) స్మార్ట్ రేషన్‌కార్డుల్లోని తప్పులను చూసి జనం తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో 3,21,740 మందికి స్మార్ట్‌రేషన్‌కార్డులను పంపిణీ చేసే కార్యక్రమం జరుగుతోంది.మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కార్డుల పంపిణీ ప్రక్రియ చిన్నచిన్న ఇబ్బందులతో సాగుతుంటే, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని 66డివిజన్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగంలోని జవాన్లకు అప్పగించి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారు.పాత రేషన్‌కార్డుల మాదిరిగా కుటుంబ యజ మానురాలి పేరుతోపాటు ఇంటి నంబరు,కాలనీ పేరు, షాపు నెంబరుతో కార్డులు తయారుచేస్తే బాగుండేదని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు.ఈసారి మూడు నెలల కోటా బియ్యం మొత్తం పంపిణీ చేశారని, మూడు నెలలతర్వాత కొత్త కార్డు ఉంటేనే బియ్యం ఇస్తారా లేదా,ఒక వేళ కార్డు ఇవ్వకుంటే తమ పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆందోళన చెందుతు న్నారు. ఇప్పటి వరకు నగరంలోని కొన్ని డివిజన్లలోనే స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ జరుగుతోంది.

కొన్ని చోట్ల అసలు ఎప్పుడు,ఎవరు,ఎక్కడ పంపిణీ చేస్తారో,వార్డు కార్యాలయాల్లో ఇస్తారో, ఇంటింటికి తెచ్చి ఇస్తారో తెలియక ప్రజలు అయోమ యానికి గురవుతున్నారు. కొందరు కార్పొ రేటర్లు వారి సమీప డివిజన్లలోని జవాన్లందరిని పిలి పించి దుకాణాల వారీగా విభజించి పంపిణీ చేస్తు న్నారు. కొన్ని చోట్ల అసలు కార్పొరేటర్లు పట్టించు కోకుండా జవాన్ల వద్దకు వెళ్లాలని చెబు తుండడంతో రేషన్‌కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది.స్మార్ట్‌రేషన్‌కార్డులపై లబ్ధిదారు పేరు, కాలనీపేరు, రేషన్ దుకాణాల నంబర్లను మాత్రమే ముద్రించారు. ఈ కార్డులపై ఇంటి నంబర్లు లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో డివిజన్‌లో రెండు, మూడు రేషన్‌షాపులుండడం, కొన్ని చోట్ల రెండు, మూడు డివిజన్లకు కలిపి ఒకే దుకాణముంది. కార్డుపై ఉన్న నంబరును చూసి సంబంధిత దుకాణాల్లోనే కార్డులను పంపిణీ చేస్తే ఇబ్బందులు ఉండేవి కావు. కార్డుపై ఇంటి నంబర్ లేకపోవడంతో జవాన్లు లబ్ధిదారులను గుర్తించడం కష్టంగా మారింది. వాటిని ఎక్కడ, ఎవరికి ఇవ్వాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్లలో కార్డులను పంపిణీ చేస్తారని ప్రకటించడంతో కార్పొరేటర్ల వద్దకు వచ్చి తమ కార్డు రాలేదని, ఎక్కడ ఇస్తారని, ఎప్పుడు ఇస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని చోట్ల జవాన్లు వారికి తెలిసిన ముఖాలను చూసి కార్డులను పంపిణీ చేస్తుండగా, కొత్తగా రేషన్‌కార్డులు వచ్చిన వారికి ఏ దుకాణం తమకు కేటాయించారో, ఎక్కడ కార్డు ఇస్తారో తెలియడం లేదని అధికారులు, కార్పొరేటర్ల చుట్టూ తిరుగుతున్నారు.

### ఎంపీ ధర్మపురి అరవిందకు బిగ్ షాక్..
## తిరగబడ్డ సొంత పార్టీ నేతలు!



తెలంగాణ బీజేపీలో అంతా సెట్ అవుతుందనుకుంటున్న సమయంలో మరోసారి అంతర్గత విభేదాల అంశం తెరపైకి వచ్చింది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పలువురు జిల్లా స్థాయి నేతలు తిరుగుబాటు మొదలుపెట్టారని సమాచారం. అర్వింద్ కు వ్యతిరేకంగా ఒక ఫామ్ హౌజ్ లో ఇటీవల కొందరు జిల్లా స్థాయి నేతలు సమావేశమైనట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ భేటీ వెనుక కొందరు కేంద్ర మంత్రుల ప్రోత్సాహం ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటం ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

2 లో

### హుజూరాబాద్‌లో మళ్లీ కాకరేపుతున్న రాజకీయ వేడి..
కాంగ్రెస్ వైఫల్యాలపై కౌశిక్ రెడ్డి భారీగా ధర్నా!



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం భారీ నిరసన చేపట్టాయి. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

2 లో

### తెలంగాణలో భారీ డిఫెన్స్ ఎక్స్‌పో
రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ స్పెషల్ ఇన్విటేషన్!

తెలంగాణాలో అధికారం చేపట్టి వెయ్యి రోజులు అయిన సందర్భంగా సీయం రేవంత్ దూకుడు పెంచారు.ఈ క్రమంలోనే అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులని రాబట్టాలన్న ధ్యేయంతో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేశారు.ఈ క్రమంలోనే దేశ రక్షణ రంగ దిగ్గజాలను, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు.

2 లో

### హైదరాబాద్ ట్రాఫిక్‌కు చెక్
## రూ.620 కోట్లతో కొత్త కారిడార్




హైదరాబాద్ నగర ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురానుంది. నల్గొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు రూ.620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన 3.23 కిలోమీటర్ల కాన్ఫ్లిక్ట్ ఫ్రీ కారిడార్‌ను రేపు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రయాణ సమయం సుమారు 30 నిమిషాల వరకు తగ్గడంతో పాటు ఇంధన వినియోగం, వాయు కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉందని తెలిపారు.

2 లో

### గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి.
పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: శాంతి కమిటీ సమావేశంలో సీపీ సాయి చైతన్య.

3 లో

### ఆయనకు అన్నీ ఆశలే
## కేటీఆర్‌పై జగ్గారెడ్డి షాకింగ్ కామెంట్స్!



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కేటీఆర్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో తెలంగాణలో స్వేచ్ఛ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చాకనే అందరికి స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. ఈ విషయాన్ని అపొజిషన్ వాళ్ళు కూడా ఒప్పుకోవాల్సిందేనని అన్నారు. దీనికి సాక్ష్యం మీడియా నే అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తిచేసుకందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రుల వెయ్యి రోజుల పాలన హ్యాపీ గా ఉందన్నారు. రాహుల్ గాంధీతో అనేక పథకాలు చెప్పించారు. అనేక పథకాలు అమలు అవుతున్నాయి,. ప్రజలు ఆస్వాదిస్తున్నారని అన్నారు. YSR తీసుకొచ్చిన ఆరోగ్య శ్రీ ఎతీం హయాంలో కనుమరుగు అయ్యిందని అన్నారు.

### గుండె ఆపరేషన్ కోసం
## 13 ఏళ్లుగా ఎదురుచూపు
ఎయిమ్స్‌లో 15 ఏళ్ల చిన్నారి మృతి




దేశ రాజధాని ఢిల్లీ ఎయిమ్స్‌లో రాజస్థాన్‌కు చెందిన 15 ఏళ్ల చిన్నారి గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే, ఆ చిన్నారి రెండేళ్ల వయసు నుంచే గుండె జబ్బుతో బాధపడుతోంది. మొదటిసారి 2012 అక్టోబరులో తల్లిదండ్రులు.. ఆమెను ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆపరేషన్ చేయాలని, అందుకు రూ.1.25 లక్షలు అవుతుందని అన్నారు. 2014లో నిర్ధారించారు కానీ, ఇన్నేళ్లు అయినా ఆ బాలికకు సర్జరీ జరగలేదు. రెండేళ్ల వయస్సు నుంచి తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతూ.. న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో చికిత్స పొందుతున్న రాజస్థాన్‌కు చెందిన 15 ఏళ్ల బాలిక మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది. కోటాకు చెందిన తన్వికి చికిత్సలో జాప్యం, ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై కుటుంబ సభ్యులు ఆరోపణలు చేయడంతో ఎయిమ్స్ ఈ ఘటనపై విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. తన్వికి సంబంధించిన వైద్య నివేదికలు, అందించిన చికిత్స, నిపుణుల అభిప్రాయాలు, ఆమె మరణానికి దారితీసిన పరిణామాలను ఈ కమిటీ క్షుణ్ణంగా సమీక్షిస్తుందని ఎయిమ్స్ ప్రకటించింది. ఆగస్టు 24న ఆసుపత్రిలో చేరిన తన్వి.. తీవ్రమైన సైయనోసిస్ (రక్తంలో ఆక్సిజన్ తగ్గి నీలంగా మారడం) బారినపడి, ఆ తర్వాత గుండెపోటుకు గురై సెప్టెంబర్ 1న ఉదయం 5:06 గంటలకు తుదిశ్వాస విడిచింది.

2 లో

## మెరుపు వరదల వేళ భారత్ ఆపన్నహస్తం..

### నేపాల్ పార్లమెంట్‌లో ప్రధాని బాలెన్ షా ప్రశంసలు



గతవారం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలతో దాదాపు 1,200 మంది ప్రాణాలు కోల్పోగా. 5 వేలకుపైగా గల్లంతయ్యారు. భారీ స్థాయి లో ఆస్తి నష్టం వాటిల్లింది. జాడలేకుండా పోయినవారి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. సహాయ చర్యలకు ప్రతికూల పరిస్థితులు ప్రతిబంధకంగా మారాయి. పునరావాసం, పునర్నిర్మాణం కోసం నేపాల్‌కు ప్రపంచ దేశాలు తమ వంతు సాయం చేస్తున్నాయి. వీటిలో భారత్ కూడా భారీ సాయం అందించింది. నేపాల్ ప్రధాని దీనిపై పార్లమెంట్‌లో ప్రకటన చేశారు. మెరుపు వరదలతో అల్లాడిపోయిన నేపాల్‌కు భారత్ అందించిన ఆపన్నహస్తంపై ఆ దేశ ప్రధాని బాలేన్ షా ప్రశంసలు కురిపించారు.

2 లో

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



సంపాదకీయం

# నదులలో నీరు ఉన్నా సాగునీరు ఇవ్వలేరా?

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నదుల్లో నీటి నిల్వ లు పడిపోయాయని, అందువల్ల కృష్ణాడెల్టాకు సాగు నీరు ఇవ్వలేమని జూలై24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రివర్గ సమావేశం ప్రకటించింది. మంత్రివర్గ నిర్ణయాన్ని సమాచార మంత్రి కె. పార్థసారథి తెలియచేశారు. వరిపంట వేయవద్దని, వరి పంట వేస్తే తర్వాత నీరులేక నష్టపోయేది మీరేనని రైతులకు హెచ్చరిక జారీచేశారు. ఎల్నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాభావంతోపాటు కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ఖరీఫ్కు చాలా ముందే ప్రకటించారు. ఆవిధంగా కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ఎల్సినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. కాని చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోలేదు. నదుల్లో నీరునిల్వకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. అలాంటి చర్యలు తీసుకోకుండా సాగునీటి విడుదల గురించి ఆర్భాటపు ప్రకటనలు చేశారు. జూన్ 1 నుంచే కాల్వలకు నీరువిడుదల చేస్తామని మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామనాయుడు ప్రకటించారు. కృష్ణాడెల్టాకి జూలై 1 నుంచి, నాగార్జునసాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కేసీ కెనాల్కి వంశధార ఆయకట్టుకు జూలై 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని, రైతులు సేద్యా నికి సిద్ధం కావాలని చెప్పారు. కృష్ణా డెల్టా ఆయకట్టుక్ 150 టిఎంసిలు అవసరమని, బ్యారేజిలో 461 టిఎంసిల నీరు అందుబాటులో ఉందని కూటమి ప్రభుత్వం ప్రకటించి జూలై1న ప్రకాశం బ్యారేజీ నుంచి ఆర్భాటంగా నీరు విడు దల చేసింది. మంత్రుల ప్రకటనతో రైతాంగం ఖరీఫ్ సేద్యా నికి సమాయత్తం అవుతూ ఉండగా రాష్ట్రప్రభుత్వం కృష్ణా డెల్టాకి సాగునీరు విడుదల చేయలేమని జూలై 24న ప్రక టించింది. మంత్రివర్గ ప్రకటన తర్వాత ఇరిగేషన్ శాఖ సమావేశం జరిగింది. ఆ సమావేశం అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఇంజినీరు ఎల్సినో ప్రభావం వల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలో, వర్షాలు తగ్గాయని చెప్పారు. రాష్ట్రంలో 51 శాతం, కృష్ణా డెల్టాలో 49 శాతం లోటు వర్షపాతం ఉందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తాగునీటికే ప్రాధాన్యత ఇచ్చిం దని చెప్పారు. పులిచింతల నీటిని కూడా తాగునీటి అవన రాలకే భద్రపర్చినట్లు వెల్లడించారు. గోదావరి ప్రవాహం తగ్గడంతో పట్టిసీమ ఎత్తిపోతల పంపింగ్ పై ప్రభావం పడిం దని అన్నారు. సీలేరు నీటి లభ్యత కూడా తగ్గిందని చెప్పారు. అందువల్ల కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం లేదని చావు కబురు చల్లగా చెప్పారు. ప్రకాశం బ్యారేజి నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతాంగానికి హెచ్చరిక జారీచేశారు. కుడికాల్వ పరిధిలో రైతులు వరిసాగు చేయవద్దని చెప్పారు. ఆరుతడి పంటలు సాగుచేయాలని పేర్కొన్నారు. జూన్, జూలై నెలల మధ్య సాగు నీరు విడుదల విషయంలో కూటమి ప్రభుత్వ వైఖరి లో మార్పువచ్చింది. జూన్ నెలలో రాష్ట్ర ంలోని అన్ని ప్రాం తాలకు సాగునీరు విడుదల తేదీలను కూటమి మంత్రులు ప్రకటించారు. సాగుకి రైతులు సిద్ధం కావాలని చెప్పారు. మంత్రుల ప్రకటనతో అప్పులు చేసి సేద్యానికి కావాల్సిన వాటిని నమకూర్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఎకరాకు 10 వేలకు పైగా రైతులు సేద్యానికి ఖర్చుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎల్సెనో ప్రభావం వల్ల ఇప్పుడు సాగు నీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెప్పడం వల్ల రైతాంగం తీవ్ర మైన మనోవేదనకు గురౌతున్నారు. జూలై1లో 461 టిఎంసిల నిల్వ ఉన్న నీరు జూలై23 నాటికి ఏమైంది. సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం ఎలా చెప్పగలుగుతున్నది. ఎల్నినో ప్రభావం. ముందుగానే కూటమి ప్రభుత్వానికి తెలుసుగా, తెలిసే సాగునీరు ప్రాంతాల వారిగా విడుదల చేస్తామన్నది గదా! ఇప్పుడు సాగునీరు విడుదల సాధ్యం కాదని చెప్పడం రైతులను మోసం చేయడం కాదా! సేద్యంపైనే చిన్న, సన్న కారు రైతు కుటుంబాల ఆధారపడి ఉన్న విషయం కూటమి ప్రభుత్వానికి తెలియదా, ఆ కుటుంబాల పరిస్థితి ఏమికా వాలి. సాగునీరు విడుదల గురించి ప్రభుత్వం చెప్పే మాట లు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. జలవనరుల వ్యవస్థ తాజా గణాంకాల ప్రకారం ప్రకాశం బ్యారేజి నీటినిల్వ 2.978 టిఎంసిలు కాగా, పూర్తి నీటిమట్టం 3.071 టిఎంసిలు. అంటే పూర్తి నీటి మట్టానికి అతితక్కువ మాత్రమే, 96.97 నీటి నిల్వతో సురక్షితంగా ఉన్నందువల్ల సాగునీటి సర ఫరాకు ఎటువంటి ఆటంకం లేదని నిపుణులు చెబుతున్నారు. డెడ్ స్టోరేజికి చేరాలంటే 2 టిఎంసిల కంటే తక్కువ ఉండాలి.బ్యారేజిలో నీరులేనప్పుడు సాగునీరు ఇవ్వాల్సి వస్తే. నాగార్జున సాగర్లేదా పులిచింతల నుంచి నీరు విడు దల చేయాలి. పులిచింతలలో ప్రస్తుతం 29.039 టిఎంసి లనీరు ఉంది. సాగు, తాగునీటి అవసరాలకు నీటిని దిగువకు విడుదల చేయవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. మరి కూటమి ప్రభుత్వం సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదు. గతంలో బ్యారేజిలో ఇంతకన్నాతక్కువనీరు ఉన్నప్పుడే సాగునీరు విడుదల చేయడం జరిగింది. కృష్ణా డెల్టాలో ప్రధాన సేద్యం వరి. అలాంటి వరిసేద్యం చేయ వద్దంటే, రైతులు ఖరీఫ్ సేద్యానికి దూరం కావడమేగదా! ఆగస్టు నెల నాటికి పూర్తిగా సేద్యం జరగాలి. ఆ తర్వాత పంటలు వేసినా ప్రయోజనంలేదు. నల్లరేగడి భూముల్లో ఇప్పుడు ఆరు తడిపంటల సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆరుతడి పంటలకు మళ్లడం కూడా రైతులకు చాలా ఇబ్బందికరం అవుతుంది. వరిసేద్యం జరగకపోతే ఆహార సమస్యకూడా ముందుకు వస్తుంది. రెండు కోస్తాతీర ప్రాంతాల్లోని చాలా జిల్లాల్లో వరిపంట తర్వాత జొన్న, మొక్కజొన్న వంటవేస్తారు. ఈపంటలు రైతులకు కొంత మిగులు ఆదాయాన్ని ఇస్తున్నాయి. ప్రకాశం బ్యారేజి కుడి, ఎడమ కాల్వలకు సాగునీరు విడుదల చేయకపోతే ఆ వంట ల సేద్యం సాధ్యం కాదు. అందువల్ల రైతులకు తీవ్రనష్టం జరుగుతుంది. ఆరుతడి పంటలు వేయమనే కూటమి ప్రభు త్వం, అందుకు అవసరమైన వాటిని కూడా ముందు జాగ్ర త్తగా సిద్ధం చేయలేదు. రైతులు వాటిని సమకూర్చుకోవా లంటే అనేక అవస్థలుపడాలి. అవస్థలు పడి ఆరుతడి పంట వేసినా చేతికి వస్తాయనే నమ్మకంలేదు. వరిపంట వల్ల మిగులు ఎక్కువలేకపోయినా నష్టం అనేది తక్కువగా ఉండటం తో రైతాంగం వరిపంట సాగుకే మొగ్గుచూపుతున్నారు. నేడు సాగునీటి సమస్యకు పాలకుల విధానాలే కారణం. ఎల్సినో ప్రమాదం గురించి ముందుగానే సమాచారం ఉన్నప్పుడు నదుల నీటినిల్వల గురించి సరైన చర్యలు తీసుకోవాలి. అ లాంటి చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకోలేదు. భారతదేశం లో అత్యధిక చెరువులు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశముందు ఉంది. 2023లో కేంద్ర ప్రభుత్వ లెక్కలప్రకారం రాష్ట్రంలో 1,90,777 నీటి వనరులుండగా, వాటిల్లో 99.7 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో 81.703 చెరువులు పంచా యతీ ఇరిగేషన్ వంటి ప్రభుత్వశాఖల పరిధిలో ఉన్నాయి. ఈ చెరవులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుని, పూడికలు తీసి నీటితో వాటిని నింపి ఉంటే, వాటి ద్వారా సాగునీరు లభించేది. చెరువులను కాపాడే చర్యలను ఏ ప్రభు త్వం తీసుకోలేదు. పట్టిసీమ ఎత్తిపోతల పంపింగ్ గురించి గొప్పలు చెప్పేకూటమి ప్రభుత్వం ముందుగానే కృష్ణాబ్యారే జికె నీరు పంపింగ్ ఎందుకు చేయలేదు. ఇప్పుడు పంపింగ్ చేయడం సాధ్యంకాదని ఎందుకు చేతులుఎత్తింది. చెరువు లను నీటితో నింపి, నిర్మాణంలో ఉన్నప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే ఈపరిస్థితుల్లో కూడా తాగు, సాగునీరు సమస్య తీరేదిగదా! ఇది పాలకుల వైఫల్యం కాదా !

## హైదరాబాద్ ట్రాఫిక్‌కు చెక్ రూ.620 కోట్లతో కొత్త కారిడార్

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపే దిశగా తెలంగాణ సర్కార్ మరో కీలక ప్రాజెక్టును ప్రారంభించేందుకు రెడీ అయింది. నల్గొండ ఎక్స్ రోడ్స్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ మీదుగా ఓవైసీ జంక్షన్ వరకు నిర్మించిన కాన్ఫ్లిక్ట్ ఫ్రీ కారిడార్ ప్రారంభానికి సిద్ధమైంది. రూ.620 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. నల్గొండ ఎక్స్ రోడ్స్–సైదాబాద్–ఐఎస్ సదన్–ఓవైసీ జంక్షన్ మధ్య నిర్మించిన ఈ కారిడార్ మొత్తం 3.23 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఇందులో ప్రధాన వయాడక్ట్ 2.53 కిలోమీటర్ల మేర నిర్మించారు. ఐఎస్ సదన్ జంక్షన్ నుంచి 200 మీటర్ల అప్ ర్యాంప్‌ను కూడా ఏర్పాటు చేశారు. చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మించిన ఈ కారిడార్ అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ కారిడార్ అందుబాటులోకి వచ్చిన తర్వాత నల్గొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు వాహనదారులు సిగ్నళ్ల వద్ద ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం తగ్గనుంది. ముఖ్యంగా చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఈ మార్గాలం ప్రయాణించే వాహనదారులకు సుమారు 30 నిమిషాల వరకు ప్రయాణ సమయం ఆదా అయ్యే అవకాశం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోయే సమయం తగ్గడంతో ఇంధన వినియోగం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.

## గుండె ఆపరేషన్ కోసం 13 ఏళ్లుగా ఎదురుచూపు ఎయిమ్స్‌లో 15 ఏళ్ల చిన్నారి మృతి

దేశ రాజధాని ఢిల్లీ ఎయిమ్స్‌లో రాజస్థాన్‌కు చెందిన 15 ఏళ్ల చిన్నారి గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే, ఆ చిన్నారి రెండేళ్ల వయసు నుంచే గుండె జబ్బుతో బాధపడుతోంది. మొదటిసారి 2012 అక్టోబరులో తల్లిదండ్రులు.. ఆమెను ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆపరేషన్ చేయాలని, అందుకు రూ.1.25 లక్షలు అవుతుందని అన్నారు. 2014లో నిర్ధారించారు కానీ, ఇన్నేళ్లు అయినా ఆ బాలికకు సర్జరీ జరగలేదు. రెండేళ్ల వయస్సు నుంచి తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతూ.. న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతున్న రాజస్థాన్‌కు చెందిన 15 ఏళ్ల బాలిక మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది. కోటాకు చెందిన తన్వికి చికిత్సలో జాప్యం, ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై కుటుంబ సభ్యులు ఆరోపణలు చేయడంతో ఎయిమ్స్ ఈ ఘటనపై విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. తన్వికి సంబంధించిన వైద్య నివేదికలు, అందించిన చికిత్స, నిపుణుల అభిప్రాయాలు, ఆమె మరణానికి దారితీసిన పరిణామాలను ఈ కమిటీ క్షుణ్ణంగా సమీక్షిస్తుందని ఎయిమ్స్ ప్రకటించింది. ఆగస్టు 24న ఆసుపత్రిలో చేరిన తన్వి.. తీవ్రమైన సైయనోసిస్ (రక్తంలో ఆక్సిజన్ తగ్గి నీలంగా మారడం) బారినపడి, ఆ తర్వాత గుండెపోటుకు గురై సెప్టెంబర్ 1న ఉదయం 5:06 గంటలకు తుదిశ్వాస విడిచింది.

## మెరుపు వరదల వేళ భారత్ ఆపన్నహస్తం..

పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ... భారత్, చైనాలు సకాలంలో స్పందించి సహాయక చర్యలకు మద్దతు ఇచ్చాయని తెలిపారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాతీయ సాయం తిరస్కరించే ప్రశ్నే తలెత్తబోదని బాలేన్ షా స్పష్టం చేశారు. విపత్తు ప్రభావాన్ని అంచనా వేసేందుకు తమ సాంకేతిక నిపుణులను భారత్, చైనాలు పంపాయని ఆయన చెప్పారు. ఆకస్మిక వరదలు సంభవించిన తొలిరోజు నుంచే నష్టాన్ని అంచనా వేయడానికి ఏరియల్ సర్వేతో పాటు ఇతర మార్గాల్లో పరిస్థితిని గమనించారని నేపాల్ ప్రధాని పేర్కొన్నారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే భారత సాంకేతిక నిపుణుల బృందం మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకుందని వివరించారు. వరద ప్రాంతాల్లో భారీగా బురద, మట్టి పేరుకుపోవడంతో రెస్క్యూ ఆపరేషన్ అత్యంత కష్టంగా మారిందని బాలేన్ షా అన్నారు. ఎక్స్కవేటర్లు మాత్రమే కాదు.. సైన్యం, రెస్క్యూ సిబ్బంది కూడా నిలబడేందుకు స్థలం లేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

## తెలంగాణలో భారీ డిఫెన్స్ ఎక్స్‌పో రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ స్పెషల్ ఇన్విటేషన్!

ఇందులో భాగంగానే ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌తో ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు.

డిసెంబర్‌లో 'భారత్ ఫ్యూచర్ సిటీ' వేదికగా మెగా సమ్మిట్

ఈ క్రమంలో రాబోయే డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఫ్యూచరిస్టిక్ విజన్‌తో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఈ గ్లోబల్ సమ్మిట్ జరగనుంది. ఈ సదస్సులో భాగంగా రక్షణ రంగానికి సంబంధించి ప్రత్యేకంగా 'డిఫెన్స్ ఎక్స్‌పో–2026'ను భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు. ఈ ఎక్స్‌పోను స్వయంగా ప్రారంభించి, రాష్ట్రంలోని యువ శాస్త్రవేత్తలు, స్టార్టప్ నిర్వాహకులకు దిశానిర్దేశం చేయాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానించారు సీయం రేవంత్. ఏరోస్పేస్, స్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన ఎన్నో అద్భుతమైన ఆవిష్కరణలను, పారిశ్రామిక ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నట్లు కేంద్రానికి వివరించారు. హైదరాబాద్ ఆకాశంలో కనువిందు చేయనున్న ఎయిర్‌షో ఇక ఈ డిఫెన్స్ ఎక్స్‌పోకు ప్రధాన ఆకర్షణగా ఒక ప్రతిష్టాత్మక ఎయిర్‌షోను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అవసరమైనఅనుమతులు మంజూరు చేయడంతో పాటు, భారత వైమానిక దళానికి చెందిన ప్రముఖ 'సూర్యకిరణ్', 'సారంగ్' ఏరోబాటిక్ బృందాలతో గగనతల విన్యాసాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. త్రివిధ దళాలకు (ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్) చెందిన అత్యాధునిక ఆయుధాలు, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు, స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ డిస్‌ప్లే ఉండేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు ఐ=ఖూ ప్రయోగశాలలు తమ స్వదేశీ రక్షణ సాంకేతికతను ఇక్కడ ప్రదర్శించేలా చూడాలని కోరారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు 1500 ఎకరాలు

ఇక ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై కూడా ఈ భేటీలో స్పష్టత వచ్చింది. ఈ ఎయిర్‌పోర్ట్ విస్తరణకు రక్షణ శాఖ మొత్తం 1500 ఎకరాలు అడగగా.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తి చేసిందని సీఎం వెల్లడించారు. మిగిలిన 750 ఎకరాలను కూడా సేకరించి అప్పగించేందుకు తెలంగాణ సర్కార్ పూర్తి సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. రూ. 1 కే 416 ఎకరాలు..

డీఆర్‌డీఎల్‌కు బంపర్ ఆఫర్

రాష్ట్రంలో రక్షణ రంగ పరిశోధనలను ప్రోత్సహించే దిశగా రేవంత్ సర్కార్ మరో కీలక అడుగు వేసింది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (DRDL) ఏర్పాటు చేయనున్న భారీ ప్రాజెక్టు కోసం ఏకంగా 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు TGIIC ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భూమిని సంవత్సరానికి కేవలం రూ. 1 నామమాత్రపు లీజుతో (33 ఏళ్ల పాటు) ఇవ్వనుండటం గమనార్హం. అవసరమైతే ఈ లీజును భవిష్యత్తులో పొడిగించేందుకు కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. తెలంగాణను గ్లోబల్ డిఫెన్స్ హబ్‌గా మార్చే ఈ చారిత్రక సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేష్ కుమార్ షెట్కార్, పోరిక బలరాం నాయక్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హుజూరాబాద్‌లో మళ్లీ కాకరేపుతున్న రాజకీయ వేడి..

'420 హామీలు - 420 ఫిట్లు' ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ, ప్రభుత్వం ప్రజలకు చెల్లించాల్సిన బకాయిలతో కూడిన 'కాంగ్రెస్ బాకీ కార్డు'లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవుళ్ల సాక్షిగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ విస్మరించి ప్రజలను వంచించిందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 సాయం, తులం బంగారం, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, పింఛన్ల పెంపు, 2 లక్షల ఉద్యోగాల భర్తీ వంటి కీలక హామీలను గాలికొది లేసిందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్‌రావు, పోల్నేని సత్యనారాయణరావు, నైనేని తిరుపతిరావు, పింగిలి రమేశ్‌లతో పాటు నియోజకవర్గ పరిధిలోని వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్, హుజూరాబాద్, జమ్మికుంట మండలాల ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ ధర్మపురి అరవింద్‌కు బిగ్ షాక్ తిరగబడ్డ సొంత పార్టీ నేతలు!

అయితే ఈ ప్రచారానికి సంబంధించి అధికారికంగా ఎలాంటి ధృవీకరణ ఇప్పటివరకు వెలువడలేదు. దీంతో అసలు సమావేశం ఎందుకు జరిగింది? దాని వెనుక ఎవరున్నారు? అన్నదే బీజేపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

నిజంగా జరుగుతుందా?

మరోవైపు ఈ పరిణామాన్ని ఎంపీ అర్వింద్ వర్గం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. తనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రయత్నాలపై పార్టీ రాష్ట్ర నాయకత్వం వద్దే తేల్చుకోవాలని అర్వింద్ వర్గీయులు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగా భారీ సంఖ్యలో కార్యకర్తలు, అనుచరులతో రాష్ట్ర పార్టీ కార్యాలయానికి బుధవారం వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 500 కార్లతో రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి తమ బలాన్ని చూపించాలన్న ప్రతిపాదనపై అర్వింద్ అనుచరుల్లో చర్చ జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ కార్యక్రమంపైనా అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. నిజంగా జరుగుతుందా? లేక సోషల్ మీడియాలో ప్రచారానికే పరిమితమవుతుందా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

22ఏ అంశం..

ఇదిలా ఉంటే, తెలంగాణ బీజేపీలో గత కొంతకాలంగా నాయకుల మధ్య సమన్వయం పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతీయ నాయకత్వం కూడా రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, నాయకుల మధ్య సమన్వయం పెంచడం, సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దడంపై దృష్టి పెట్టింది. ఇటీవల జాతీయ స్థాయిలో తెలంగాణ బీజేపీ నేతలతో సమీక్షలు, రాష్ట్ర నాయకత్వంతో సమావేశాలు జరగడం కూడా ఇదే క్రమంలో కనిపిస్తోంది. అలాంటి సమయంలోనే అర్వింద్ వ్యవహారం తెరపైకి రావడం పార్టీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి బీజేపీ రాష్ట్ర నాయకత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోంది. 22ఏ అంశం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతుల సమస్యలపై రాష్ట్రస్థాయి పోరాటాలకు పార్టీ సిద్ధమవుతున్న తరుణంలో అంతర్గత విభేదాల వార్తలు రావడం నాయకత్వానికి ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

500 కార్లతో ర్యాలీ..

అసలు అర్వింద్‌కు వ్యతిరేకంగా జిల్లా నేతల సమావేశం జరిగిందా? జరిగితే దాని ఉద్దేశం ఏమిటి? కేంద్ర మంత్రుల ప్రోత్సాహం ఉందన్న ప్రచారంలో నిజమెంత? అన్న ప్రశ్నలకు పార్టీ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు 500 కార్లతో రాష్ట్ర కార్యాలయానికి వెళ్లాలన్న అర్వింద్ వర్గం ఆలోచన కార్యరూపం దాలిస్తే, అది బీజేపీలో అంతర్గత బలాబలాల ప్రదర్శనగా మారే అవకాశం ఉంది. దీంతో ఈ వ్యవహారం ఇప్పుడు తెలంగాణ బీజేపీ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తోంది. ఇదిలా ఉండగా ఇటీవల తెలంగాణకు చెందిన ఒక ఎంపీ కాంగ్రెస్ లోకి చేరాలని ఏఐసీసీ నేతలతో చర్చించారనే వార్తలు జోరుగా వచ్చాయి. ఆ కొద్దిరోజులకే ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా జిల్లా నేతలు రహస్య మీటింగ్ నిర్వహించడం ఆసక్తికరంగా మారింది.

అర్వింద్‌కు వ్యతిరేకంగా..

జాతీయ నాయకత్వం తెలంగాణలో పార్టీని వచ్చే ఎన్నికలకు మరింత పటిష్టంగా సిద్ధం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న వేళ.. ఇలాంటి అంతర్గత పరిణామాలు ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. ఇప్పటికే రాష్ట్ర బీజేపీలో నాయకత్వ సమన్వయంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో అర్వింద్ ఎపిసోడ్ కొత్త కోల్డ్ వార్‌కు నాంది అవుతుందా? లేక రాష్ట్ర నాయకత్వం జోక్యంతో ఈ వివాదం అక్కడికక్కడే సద్దుమణుగుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతానికి మాత్రం అర్వింద్‌కు వ్యతిరేకంగా జరిగినట్లు చెబుతున్న జిల్లా నేతల భేటీ, దానికి కొనసాగింపుగా వినిపిస్తున్న 500 కార్ల వ్యవహారం తెలంగాణ బీజేపీలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఆయనకు అన్నీ ఆశలే కేటీఆర్‌పై జగ్గారెడ్డి షాకింగ్ కామెంట్స్!

మళ్ళీ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వచ్చాక పది లక్షల ఆరోగ్య శ్రీ అమలు అవుతుందని, రైతు ఋణమాపి అందరికి కాలేదు అని ప్రచారం ఉందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీపై పై కేటిఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో జగ్గారెడ్డి కేటీఆర్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటిఆర్ కోరికలు ఉన్నోడు ఆశలు ఉన్నోడు. కేటిఆర్ మాజీ ముఖ్యమంత్రి కొడుకు మాజీమంత్రి రాహుల్ గాంధీ కుటుంబం మీకు ఏమి అన్యాయం చేశారో చెప్పాలన్నారు. తెలంగాణ కోసం ఒక రాష్ట్రాన్ని కోల్పోయారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే ముందు కేటిఆర్ ఆలోచించాలన్నారు. పద్దతి గల కుటుంబాన్ని పద్ధతి లేని కుటుంబం తిట్టడం ఏంటి? ఉద్యమంలో కేసీఆర్ ఫ్యామిలిలో ఎవరు చనిపోలేదు. రాష్ట్ర విభజన చేయకపోతే చేయాలని అని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇంటి చుట్టూ తిరిగారని గుర్తు చేశారు. రాష్ట్రం ఇస్తే మేము కాపలా కుక్కలాగా ఉంటాం మాకు పదవులు వద్దు అని మీరే అన్నారు. ఇప్పుడు పదవులు లేక పోయే సరికే చేరువులో చేపల్లాగా గిలాగిలా కొట్టుకుంటున్నారని ఎద్దేవా వేశారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
గురువారం
3 -09-2026



## జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెకరేటరీగా శ్రీమతి నీలిమ ముద్దసాని

### – మర్యాదపూర్వకంగా కలిసిన కమ్యూనిటీ మీడియేటర్ మెంబర్స్

నిజామాబాద్, సెప్టెంబర్ 02, ప్రజాగళం: నిజామాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా DLSA ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేటర్ మెంబర్స్ బుధవారం జిల్లా కోర్టు సముదాయం లోని ఋూూూ ఛాంబర్ లో జడ్జి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మీడియేటర్స్ రవీందర్ పటేల్, కుంచం శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్ లు జడ్జి తో తాము కమ్యూనిటీ మీడియేటర్స్ గా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే గతంలో ఉన్న జడ్జీలు తమకు సహాయ సహకారాలు అందించిన విషయం గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఋూూూ సెకరెటరీ, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని మాట్లాడుతూ జవీఎ ఓల్డ్ డీఈఓ ఆఫీస్ వాళ్లు చేస్తున్న కృషిని అభినందించారు. ప్రస్తుతం సమాజంలో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థ అవసరమన్నారు. ఈ వ్యవస్థను ఇంకా పటిష్టం చేసి సమస్యల పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మంచి సమాజాన్ని తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చిన్న చిన్న విషయాలకే కుటుంబంలో కలహాలకు తావియొద్దని అలాగే ప్రతి ఒక్కరూ సర్దుకుపోయే గుణం అలవర్చుకున్నప్పుడు కుటుంబం, గ్రామం, పట్టణం, జిల్లా బాగుంటుందని అన్నారు.

## ఎస్ఆర్ఎం ట్రేడర్స్ పై అధికారుల మెరుపు. దాడి.

### 523 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత.- ట్రేడర్స్ యజమానులపై కేసు నమోదు.




నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 2 (ప్రజాగళం ) అక్రమంగా పిడిఎస్ బియ్యం నిల్వ ఉంచిన మిల్లు పై సివిల్ సప్లై అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు నవీపేట మండలం అనంతగిరి శివారులో గల ఎస్ఆర్ఎం ట్రేడర్ పై హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, సివిల్ సప్లై అధికారులు, నవీపేట పోలీసులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో ఎస్ఆర్ఎం ట్రేడర్స్ లో 523 క్వింటాళ్ల అక్రమంగా నిలువ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తాహాసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం, చించోలి గ్రామంలోని అన్నపూర్ణ ట్రేడర్స్ నుంచి అక్రమంగా అనంతగిరి లోని ఎస్ ఆర్ ఎం ట్రేడర్స్ లోకి పిడిఎస్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ దాడిలో 523 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పరుచుకుని, ఒక డీసీఎం వాహనాన్ని సీజ్ చేశారు. ఎస్ ఆర్ఎమ్ ట్రేడర్స్ యజమాని శివప్రసాద్, అన్నపూర్ణ మిల్లు యజమాని హరికృష్ణ లపై కేసు నమోదు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ ఆర్ ఎం ట్రేడర్స్ లో పిడిఎస్ అక్రమ బియ్యం రవాణా పై ఇప్పటివరకు మూడు కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు. మరో మారు ఇలాంటి చర్యలకు పాల్పడితే పిడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.. ఈ దాడిలో టాస్క్ డీఎస్పీ శేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ రావు, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ రవి రాథోడ్, నవీపేట్ పోలీసులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ఆలూర్ వాసి మృతి...

ఆర్మూర్ సెప్టెంబర్ 2(ప్రజగళం) ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కచర్ల మోహన్ (40) దుబాయ్‌లో మృతి చెందారు. ఉపాధి నిమిత్తం గత పదేళ్లుగా దుబాయ్‌లో నివసిస్తూ జీవనం సాగిస్తున్న మోహన్.. మంగళవారం (ఆగస్టు 4) రాత్రి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులుతెలిపారు.మోహన్ మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదానికి గురయ్యారు. మృతుడికి భార్య కచర్ల రాణి, కుమారుడు గణేష్ ఉన్నారు.

## పోలీస్ ఎన్నికల్లో ఆర్మూర్ సిబ్బందికి కీలక పదవులు...

### జిల్లా ప్రెసిడెంట్‌గా ఎర్రపాటి శ్రీనివాస్.. వైస్ ప్రెసిడెంట్‌గా యాసిర్ అరాఫత్..

### ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా శ్రీజ.... శాలువా ఘనంగా సన్మానించిన ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర రెడ్డి...

ఆర్మూర్ సెప్టెంబర్ 0 2: (ప్రజగళం) నిజామాబాద్ జిల్లా పోలీసు ఎన్నికల్లో ఆర్మూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి కీలక పదవులు దక్కాయి. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రపాటి శ్రీనివాస్ జిల్లా ప్రెసిడెంట్‌గా, ఎస్సై యాసిర్ అరాఫత్ వైస్ ప్రెసిడెంట్‌గా, ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీజ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గాఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గౌడ్తో పాటు ఆర్మూర్ డివిజన్ పోలీస్ సిబ్బంది అభినందించారు. వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ పదవుల్లో సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీసు ఎన్నికల్లో ఆర్మూర్ సిబ్బందికి ప్రాధాన్యత కలిగిన పదవులు లభించడం పట్ల పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## రేవంత్ పాలన అట్టర్ ప్లాప్.. కాంగ్రెస్ గ్రాఫ్ అడుగంటింది

### ఇది ప్రజాపాలన కాదు.. పిచ్చి తుగ్లక్ పాలన : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి




ఆర్మూర్, సెప్టెంబర్ 2(మనం న్యూస్) ఆర్మూర్ రేవంత్‌రెడ్డి పాలన అట్టర్ ప్లాప్ కాగా, కాంగ్రెస్ గ్రాఫ్ పూర్తిగా అడుగంటిపోయిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ బుధవారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలన అంతా డంబాచారం, గోబెల్స్ ప్రచారమేనని, అప్పులు చేయడం, తప్పులు చేయడం తప్ప ప్రజలకు చెప్పుకునే గర్వకారణమైన పని ఏదీ లేదని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్లు వేసి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలనలో నోరు తెరిస్తే అబద్ధాలు, అడుగడుగునా మోసాలేనని విమర్శించారు.రైతు బంధుకు రాం రాం, దళిత బంధుకు నై భీమ్ అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని జీవన్‌రెడ్డి అన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతు భరోసా కింద రూ. 15 వేల పెట్టుబడి సాయం హామీని కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. 24 గంటల కరెంట్ పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ. 2,500, విద్యార్థినులకు స్కూటీలు, పెంచిన పెన్షన్లు వంటి హామీల పరిస్థితి ఏమిటని నిలదీశారు.కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం ఇస్తామని చెప్పి ఒక్కరికైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, ప్రతిపక్షాలు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. ఆర్మూర్ నుంచి హైదరాబాద్ వరకు అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని విమర్శించారు.కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణకు స్వర్ణయుగం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి.

### పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: శాంతి కమిటీ సమావేశంలో సీపీ సాయి చైతన్య.




నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 2 (ప్రజాగళం ) గణేష్ పండగ ఉత్సవాలను మతసామరస్యాలను కాపాడుతూ శాంతియుత వాతావరణం లో నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. గణేష్ చవితి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హాజరై గణేష్ ఉత్సవాల నిర్వహణ , భద్రతా ఏర్పాట్లు , శాంతిభద్రతలు , ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై శాంతి కమిటీ సభ్యులు , గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సమీక్షించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన , సోదరభావంతో కూడిన శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ అనేది ప్రజలందరినీ ఐక్యం చేసే కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవడంతో పాటు , పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు , అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ , పార్కింగ్ , జనసందోహం నియంత్రణకు నిర్వాహకులు ప్రత్యేకంగా సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలు , సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు , సమయ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కూడా నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని ముందుగా నిర్ణయించిన మార్గాలు , సమయాలను పాటించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో పాల్గొనే వారు ఎలాంటి రెచ్చగొట్టే నినాదాలు , వివాదాస్పద చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు , వదంతులను నమ్మవద్దని , ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని , గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా , సురక్షితంగా , విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని అవసరమైన భద్రతా చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా శాంతి కమిటీ సభ్యులు , గణేష్ మండపాల నిర్వాహకులు , ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి మత సామరస్యాన్ని , శాంతిభద్రతలను కాపాడుతూ గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సార్వజనీక కమిటీ యొక్క సూచనల ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ , నిజామాబాద్ టౌన్ సీ ఐ శ్రీనివాస్ రాజ్ , టౌన్ 1 ఎస్ హెచ్ ఓ రఘుపతి , 4 టౌన్ ఎస్. హెచ్.ఓ సతీష్ , నార్త్ సీ.ఐ శ్రీనివాస్, సౌత్ సీ ఐ సురేష్ , ఎస్.ఐ లు సార్వజని గణేష్ మండలి సభ్యులు , గణేష్ మండలి నిర్వాహకులు , ఆర్గనైజర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుత్ప, అలీసాగర్ ఆయకట్టు పంటలను కాపాడండి.

### జిల్లాకలెక్టర్ కు బీజేపీ జిల్లా అధ్యక్షుడి వినతి.




నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 02: ( ప్రజాగళం ) గుత్ప, అలీసాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ఆయకట్టు దిగువ ప్రాంతాలకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలనీ దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాలు సకాలంలో కురవకపోవడం, కురిసిన వర్షపాతం కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కురిసిన అరకొర వర్షాలపైనే ఆశలు పెట్టుకుని అన్నదాతలు జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో వరి పంటను సాగు చేశారన్నారు..వర్షాభావ పరిస్థితుల కారణంగా సకాలంలో నీరు అందక రైతులు వేసిన వరి పంట ఎండిపోవడం జరుగుతుందన్నారు. భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని. దీనివల్ల బోరుబావుల్లో నీరు అడుగంటిపోయి, పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందన్నారు.నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అలీసాగర్, గుత్ప (లిఫ్ట్) ఆయకట్టు దిగువ ప్రాంతాలకు సాగునీటిని తక్షణమే విడుదల చేస్తే, ప్రస్తుతం ఖరీఫ్ సాగులో ఉన్న వరి పంట ఎండిపోకుండా కాపాడుకోవచ్చని,ఈ నీటి విడుదల వల్ల భూగర్భజలాలు పెరిగి నాన్ కమాండింగ్ ఏరియాలోని బోర్లకు కూడా నీటి లభ్యత పెరిగి రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు., నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అలీసాగర్, గుత్ప (లిఫ్ట్) ఆయకట్టు దిగువ ప్రాంతాలకు తక్షణమే సాగునీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకుని అన్నదాతలను ఆదుకోవాలని కోరారు, లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో కార్పొరేటర్ ప్రమోద్, బీజేపీ నాయకులు పోతన్కర్ లక్ష్మీనారాయణ, అమంద్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
గురువారం
3 -09-2026

# వేయ్యి రోజుల కాంగ్రెస్ పాలన అట్టర్ ప్లాప్

## 420 హామీలపై బాకీ కార్డుల పంపిణీ.- నిరసనలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా.

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 2 ( ప్రజా గళం ) వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన పూర్తి అట్టర్ ప్లాప్ అయిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజల జీవితాలను ఛిద్రం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిగాల గణేష్ గుప్తా కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి పని చేసేందుకు సమయం ఇచ్చినా మార్పు రాకపోవడంతో, అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ నిరసనలో భాగంగా 420 హామీలతో కూడిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రజల ముందు ప్రదర్శించారు; ఈ నిరసనలు వారం రోజుల పాటు కొనసాగుతాయని బిగాల గణేష్ గుప్తా స్పష్టం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినందుకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పి, ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఎగనామం పెట్టిన స్కీములు, నిధుల వివరాలతో కూడిన బాకీ కార్డులను 26వ డివిజన్ కోటగల్లిలో ఇంటింటికీ పంపిణీ చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజల జీవితాలు ఛిద్రమయ్యాయని, ఎన్నికల హామీలను గాలికొదిలేసి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలను నిలువునా మోసం చేసిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు 1000 రోజులైనా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కొత్తగా ఏర్పడిన ఏ ప్రభుత్వానికైనా పనిచేసేందుకు కొంత సమయం ఇవ్వాలనే సదుద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఇన్నాళ్లూ వేచి చూశారని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రజలను నిరంతరం మోసం చేస్తుండటంతో ఇక చూస్తూ ఊరుకోబోమని, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ పిలుపులో భాగంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో నిజామాబాద్ లోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇస్తామని ఎగనామం పెట్టిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు రావాల్సిన డబ్బుల వివరాలను 'బాకీ కార్డు' రూపంలో రూపొందించారు. నిజామాబాద్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిర్ప రాజు ఆధ్వర్యంలో 26వ డివిజన్ పరిధిలోని కోటగల్లి ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ఈ బాకీ కార్డులను పంపిణీ చేసి, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూకిరణ్ శేఖర్,నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్,నవీద్ ఇక్బాల్, జగత్ రెడ్డి,అబ్దుల్ మతీన్,బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,డివిజన్ ఇంచార్జులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# 22ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా పాటించాలి.

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి.- రెవెన్యూ అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా.



నిజామాబాద్, సెప్టెంబర్ 02 ( ప్రజాగళం ప్రతినిధి) నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమగ్ర ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే సహేతుక నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారీగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి, ఆన్లైన్లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, నిర్దిష్ట రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని హితవు పలికారు. నిషేధిత భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని, సమగ్ర వివరాలతో నిర్ణీత ఫార్మాట్ లో నివేదికను రూపొందించి వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# వేయ్యి రోజుల ప్రజాపాలన భేష్.

## సంక్షేమం--అభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు పెద్దపీట.

## నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి.



నిజామాబాద్ రూరల్ సెప్టెంబర్ 2 (ప్రజాగళం ) వేయ్యి రోజుల ప్రజా పాలన భేషుగ్గా ఉందని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు రేకులపల్లి భూపతిరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కారు సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని వెల్లడించారు. ఈ మేరకు నిజామాబాద్ నగర శివారులోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 1000 రోజుల పాలనపై బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు.కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. ప్రజల పక్షాన ప్రశ్నించని కేసీఆర్ రాజీనామా ఎందుకు చేయకూడదో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ 1000 రోజుల్లో 1 కోటి 24 లక్షల 40 వేలు జీతభత్యాలు తీసుకున్నారని అన్నారు. 22 వేల కోట్లు ప్రభుత్వం కేసీఆర్ పై వెచ్చించిందన్నారు. బీఆర్ఎస్ ను ప్రజలు మర్చిపోయారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటుందని, ఇందులో భాగంగానే తెలంగాణకు నిధులు ఇవ్వడం లేదన్నారు.తెలంగాణను పునర్నిర్మిస్తామని చెప్పి కుటుంబ పాలన సాగించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని భారీగా దుర్వినియోగం చేశారని, కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజలకు ప్రయోజనం కలగలేదని ఎమ్మెల్యే ఆక్షేపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధ వాతావరణాన్ని ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని భూపతి రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 4 లక్షలకుపైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణ దిశగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ వంటి హామీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.రైతుల సంక్షేమానికి రూ.1.68 లక్షల కోట్లకు పైగా కేటాయించామని, సుమారు రూ.25 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు

# ఈతవనాల పెంపుతో పర్యావరణ పరిరక్షణ.





## - గీత కార్మికుల జీవనోపాధికి ఊతం.
## - ఈత వనమహోత్సవంలో సత్యనారాయణ గౌడ్.

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 2 (ప్రజాగళం ) పర్యావరణ పరిరక్షణకు ఈతవనాలు దోహదపడటంతోపాటు.. వాటిపై ఆధారపడే గీత కార్మిక కుటుంబాలకు జీవనోపాధిని అందిస్తున్నాయని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నంబర్--2 అధ్యక్షుడు జి. సత్యనారాయణ గౌడ్ హితవు పలికారు. ఈత చెట్లను విస్తారంగా పెంచి సంరక్షించడంతో పచ్చదనాన్ని పెంచడమే కాకుండా గీత కార్మికుల సంప్రదాయ వృత్తికి అండగా నిలవచ్చని పేర్కొన్నారు. బుధవారం కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నంబర్--2, ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు జి. సత్యనారాయణ గౌడ్ నేతృత్వంలో ఈతవన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈత మొక్కలు నాటి, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈత చెట్ల పెంపకం, సంరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమానికి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్, ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్వప్న, ఎస్సైలు మల్లేష్, గంగాధర్, మమతతోపాటు ఎక్సైజ్ సిబ్బంది హాజరయ్యారు. ఈతవనాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈత చెట్లు గీత కార్మికుల జీవనాధారంగా ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచేందుకు మరిన్ని మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నాటిన మొక్కలను కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా అవి ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న ఈతవనాలను కాపాడటంతోపాటు కొత్త వనాలను అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈత చెట్లు పచ్చదనాన్ని పెంచడంతోపాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని, మరోవైపు కల్లు గీత ద్వారా గీత కార్మిక కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని వివరించారు. అందువల్ల ఈతవనాల సంరక్షణను పర్యావరణ పరిరక్షణతోపాటు గీత కార్మికుల జీవనోపాధికి సంబంధించిన అంశంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈతవనాల పెంపకం, సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నంబర్--2 డైరెక్టర్లు శ్రీహరి గౌడ్, బాలా గౌడ్, గంగాధర్ గౌడ్, దుర్గా గౌడ్‌తోపాటు సంఘం సభ్యులు, గీత కార్మికులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ఎదుట గల్ఫ్ బాధితుల ఆందోళన.

## పరిస్థితి ఉద్రిక్తత, న్యాయం చేయాలంటూ డిమాండ్.



ఆర్మూర్ సెప్టెంబర్ 2(ప్రజాగళం) ఆర్మూర్ పోలీస్ స్టేషన్ వద్ద గల్ఫ్ బాధితుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. గల్ఫ్ ఏజెంట్ నాగావత్ ప్రవీణ్ పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు ఆందోళన దిగారు. ఏజెంట్ కారును అడ్డగించి, కారు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పోలీస్ స్టేషన్ వద్ద గల్ఫ్ బాధితులు తమకు న్యాయం చేయాలంటూఆందోళన చేపట్టారు. ఇజ్రాయిల్ దుబాయ్ కి పంపిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం దస్తులాబాద్ గ్రామానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ నాగవత్ ప్రవీణ్ పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు డిమాండ్ చేశారు. గల్ఫ్ బాధితుల వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఫేక్ పర్మిట్ వీసా ప్రాసెసింగ్ చూపించి మోసం చేశాడని ఆరోపించారు. ప్రవీణ్ పై కేసు నమోదు కావడంతో అతని న్యాయవాది తీసుకు వెళ్లడంతో ఆందోళన గురైన గల్ఫ్ బాధితులు న్యాయవాది కాళ్లపై పడి మొరపెట్టుకున్నారు. గల్ఫ్ ఏజెంట్ పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను కోరారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com